

వినుకొండ కోటప్పనగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు



భక్తుల చేత పూజలు అందుకుంటున్న యడ్లపాడులోని విఘ్నేశ్వరుడు



వినుకొండ కార్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహం

క్లుప్తంగా

నేటి నుంచి స్కూల్ గేమ్స్

ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.రామకృష్ణారెడ్డి, ఎస్‌జీఎఫ్ కో ఆర్డినేటర్ ఎ.వీరాంజనేయులు మంగళవారం తెలిపారు. మండలస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

శావల్యాపురం: విగ్రహాలు నిమజ్జన సమయంలో యువకులు సంయమనం పాటించాలని, కమిటీ సభ్యులు పోలీసు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషను సందర్శించారు. గొడవలు, అల్లర్లు జరిగితే కమిటీ సభ్యులను బాధ్యులను చేసి చట్టపరంగా కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం పలు గ్రామాల్లో పర్యటించి వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులతో మాట్లాడి జాగ్రత్తలు సూచించారు.

క్రీడా సామగ్రి మంజూరు

శావల్యాపురం: విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించటానికి ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా సామగ్రి ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎంఈవో మద్దికుంట సాంబశివరావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మండలంలోని 39 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ఎంపీపీ స్కూల్స్ 9 క్రీడా సామగ్రి కల్గిన ఆట వస్తువులు, యూపీ పాఠశాలలకు 14 సామగ్రి, జెడ్పీ ఉన్నత పాఠశాలలకు 16 సామగ్రి క్రీడా వస్తువులను మంజూరు చేసిందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాదెండ్ల: మండలంలోని ఇర్లపాడు 11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ అశోక్ కుమార్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని ఎండుగుంపాలెం, బుక్కాపురం, రాజుగారిపాలెం, గున్నావారిపాలెం, ఇర్లపాడు, ఇండస్ట్రీయల్ ఫీడర్, అమీన్‌సాహెబ్ పాలెంలో ఉదయం 8–11 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి ఏపీపీగా దంతాచారి

నరసరావుపేట టౌన్: 13వ అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి ఏపీపీగా బుచ్చి దంతాచారిను నియమిస్తూ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఏపీపీగా పనిచేసిన కాకుమాను బాలహనుమంతారెడ్డి పదవీ కాలం ముగియడంతో ఆయన స్థానంలో అడిషనల్ సబ్‌కోర్టు ఏపీపీగా విధులు నిర్వహిస్తున్న బుచ్చి దంతాచారికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

వేర్వేరు గ్రామాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని చింతలచెర్వు సెక్టారు పరిధిలోని తంగిరాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.రాజ్యలక్ష్మి, జయసూర్యలు పాల్గొని గర్భిణీలు, కిషోర బాలికలు, బాలింతలు తీసుకోవాలని పౌష్టికాహారాన్ని తెలియజేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పంపిణీ చేస్తున్న బాలామృతం, పాలు, గుడ్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళలు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో అంగన్‌వాడీ సెంటరులో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య పాల్గొని మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లలో ప్రభుత్వం అందించే పోషకాహారం కాకుండా అదనంగా తక్కువ ఖర్చుతో కూడిన ఆకుకూరలు పప్పుదినసులు కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ స్కూలు ప్రధానోపాధ్యాయురాలు శిరీషా, ఆరోగ్య కార్యకర్త మల్లేశ్వరీభాయి, కార్యకర్తలు సీతామహాలక్ష్మి, జ్యోతి, హరిత, శ్రీదేవి, తిరుమల దేవి, సామ్రాజ్యం పాల్గొన్నారు.

వందనమయ్యా.. బొజ్జగణపయ్యా

- వాడవాడలా పార్వతీనందనుడికి వ్రతాలు
- భక్తిశ్రద్ధలతో ఆచరించిన భక్తజనం

నరసరావుపేట ఈస్ట్: పట్టణంలో వినాయక చవితి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వివిధ పందిర్లలో సోమవారం గణనాథుడికి పూజాధికాలను శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. పాతూరు టెలిఫోన్ ఎక్సేంజ్ మద్ది రాఘవయ్య బావి వద్ద యంగ్‌స్టర్స్ హెల్పింగ్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చవితి పందిరిలో 20 అడుగుల ఎత్తు 16 అడుగుల వెడల్పుతో భారీ దశావతార గణనాథుడు కొలువుదీరి భక్తుల పూజలందుకుంటున్నాడు. చవితి పర్వదినాన 1108 ఉండ్రాళ్లతో గణపతిని పూజించగా, రెండవరోజు మంగళవారం 1108 వెలగపండ్లతో స్వామి వారిని సహస్ర అష్టోత్తర శతనామావళితో అర్చించారు. అలాగే శ్రీరాంపురంలో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రుల 27వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. విద్యుత్‌దీప కాంతులతో శోభాయమానంగా మండపం నిర్మించారు. ప్రవేశమార్గంలో వివిధ దేవతామూర్తులను ఏర్పాటు చేశారు. ప్రకృతి రమణీయత ఉట్టిపడేలా పక్షులతో కూడిన పచ్చని చెట్టు క్రింద కొలువు దీరిన గణనాధుడు భక్తులకు అభయమిస్తూ పూజలందుకుంటున్నాడు. అలాగే కాకుమాను బజారులో ఏర్పాటు చేసిన పందిరిలో ఆదిదంపతులు ఉమా మహేశ్వర సహితంగా బొజ్జగణపయ్యను భక్తులు దర్శించుకొని పూజలు నిర్వహిస్తున్నారు. కాగా, పట్టణంలోని ప్రతి ప్రధాన కూడళ్లలో పందిర్లను ఏర్పాటు చేసి భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. ఆయా పందిర్ల వద్ద ప్రతిరోజు సాయంత్రం సాంస్కృతిక, భక్తి కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): భాద్రపద శుద్ధ చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణ, రూరల్ పరిధిలో గణనాథునికి తొలి పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండపాల వద్ద విఘ్నాధిపతికి పూజలు చేసి వినాయక చవితి విశిష్టతను భక్తులకు తెలియజేసి తీర్థప్రసాదాలు అందజేశారు. పట్టణంలోని సురేష్‌మహల్ రోడ్డు, ఫ్యాన్సీ కొట్లసెంటర్, దక్షిణం బజారు గమిడి ఆంజనేయస్వామి దేవాలయం, బోసు బొమ్మ సెంటర్‌ల వద్ద భారీ వినాయక విగ్రహాలను లక్షలాది రూపాయల వ్యయంతో ఏర్పాటు చేశారు. పలు మండపాల వద్ద నిర్వాహకులు సాంస్కృతిక కార్యక్రమాలను, మ్యాజిక్ షోలు, కోలాటాలను ఏర్పాటు చేశారు. చిన్నారులు సైతం మండపాలను ఏర్పాటు చేసుకుని బుజ్జి గణపయ్యలను పూజించారు. అలాగే పలువురు మట్టి విగ్రహాలను ఉచితంగా భక్తులకు అందజేశారు.

కోటప్పనగర్‌లో ఎమ్మెల్యే పూజలు

వినుకొండ రూరల్ మండలం కోటప్పనగర్‌లో గ్రామస్తులు ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



నరసరావుపేట ఎన్జీవో కాలనీలో గణేషుడి పూజలకు హాజరైన భక్తులు

కార్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో....

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా కార్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. 22 అడుగుల సింహాసనంపై ఆసీనులైన వినాయక విగ్రహానికి ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పలువురు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి: వినాయక చవితిని మండల ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో విఘ్న గణపతి, వినాయకుడు విగ్రహాలు ఏర్పాటు చేసి మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని మేళ్ళవాగు, జయంతిరామపురం, రేమిడిచర్ల, రావులాపురం, వెల్లటూరు, పేర్లపాడు తదితర గ్రామాల్లో చవితి వేడుకలను నిర్వహించారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: వినాయక చవితి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పండుగను పురస్కరించుకొని సోమవారం తెల్లవారుజాము నుంచే విఘ్నేశ్వరుడికి ఇష్టమైన పత్రిని కొనుగోలు చేశారు. గరిక, ఉసిరి, నేరేడు, దానిమ్మ, జమ్మి తదితరాల విక్రయాలతో వీధులు కళకళలాడాయి. ప్రతి ఏటా పండుగను పురస్కరించుకొని షరాఫ్‌బజార్, చలివేంద్రబజారు, తవ్వా బాపనయ్య వీధి, గాంధీపేట, మార్కెట్ సెంటర్, సుబ్బయ్యతోట, పండరీపురం, పురుషోత్తమపట్నం తదితర చోట్ల భారీ వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయటం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా చవితి పందిళ్లు ఏర్పాటు చేసి లక్షలు వెచ్చించి పోటాపోటీగా వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేశారు. షరాఫ్ బజారులో రూ. 8 లక్షలు వ్యయంతో అమెరికన్ డైమండ్స్ పొదిగిన వినాయక విగ్రహంతో పాటు చలివేంద్రబజారు తదితర చోట్ల ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వినాయక చవితిని పురస్కరించుకొని ఆలయాల్లో సైతం భక్తులు భారీగా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఈపూరులో...

ఈపూరు: వినాయక చవితి వేడుకలు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి గ్రామంలో వినాయక మండపాలను భారీ స్థాయిలో ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలను పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. సంవత్సరానికి ఒకసారి వచ్చే వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా పూజలు నిర్వహించి అనంతరం తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆయా గ్రామాలకు సంబంధించిన పోలీసులు ఎటువంటి అల్లర్లు జరగకుండా బందోబస్తు పర్యవేక్షిస్తున్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: వినాయక చవితి పర్వదినం సందర్భంగా మండలంలో అన్నీ గ్రామాల్లో చవితి వేడుకలు ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా మట్టి ప్రతిమలు వివిధ రకాల పత్రితో చిన్నారులు పెద్దలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లో పోటాపోటీగా భారీస్థాయిలో విగ్రహాలు ఏర్పాటు చేశారు. విగ్రహాలను పూలమాలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. రాత్రిపూట పందిళ్ల విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. వేదపండితులు, వేదమంత్రాలు, లౌడు స్పీకర్ల నడుమ సంప్రదాయబద్ధంగా, గణనాథుడికు పూజా కార్యక్రమాలు చేశారు. మండలంలోని వేల్పూరు గ్రామంలో కళామందిరం సెంటరులో 22వ వార్షికోత్సవం సందర్భంగా గణనాధుడి పూజా కార్యక్రమంలో ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గకుండా స్థానిక ఎస్సై తిరుపతిరావు పర్యవేక్షణలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కమిటీ సభ్యులతో బైండోవర్ చేయించుకున్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలో సోమవారం వినాయక చవితి పండుగను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మహిళలు, పిల్లలు, పెద్దలు తలంటు స్నానాలు చేసి నూతన వస్త్రాలు ధరించి ఇళ్లలో మట్టితో చేసిన వినాయకుని బొమ్మలను పత్రితో పూజించారు. విద్యార్థులు తమ పుస్తకాలను వినాయకుని బొమ్మ ముందు ఉంచి పూజలు చేశారు. మండలంలో పలు గ్రామాలలో గల వినాయకుని ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలకు వచ్చిన భక్తులకు పూజార్లు వినాయక చవితి పండుగ విశిష్టత గురించి వివరించారు అనంతరం వినాయకుని విగ్రహాలకు ఏర్పాటు చేసిన పందిర్లలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి వేళల్లో వినాయక ఆలయాల్లో బొమ్మల వద్ద భజన కార్యక్రమాలు నిర్వహించారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: గ్రామాల్లో వీధివీధిలో విఘ్నాధిపతులు కొలువుదీరారు. బుధవారం ప్రతిఇంటా మామిడాకులు కట్టి పూల తోరణాలు నింపి బొజ్జ గణపయ్యకు పూజలు చేశారు. గణపతి నవరాత్ర సందర్భంగా మండలం పరిధిలో మొత్తం 50కు పైగా నిర్వాహకులు చవితి పందిళ్లు ఏర్పాటు చేశారు. వీటిలో అత్యధికంగా మండల కేంద్రమైన యడ్లపాడులో ఉండటం విశేషం. కొత్తూరు, వడ్డెరబజార్, జాలాది రోడ్లు, హైస్కూల్ రోడ్, రాజులబజార్, బీసీ కాలనీ, మెయిన్‌బజార్, పోలీస్‌స్టేషన్ పక్కన ఇలా పదికి పైగా పందిళ్లు వెలిశాయి. అన్నిచోట్ల చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. దాతల సహకారంతో ఆయా పందిళ్ల వద్ద పలు రకాల ప్రసాదాలను పంపిణీ చేశారు. యడ్లపాడు మెయిన్‌రోడ్డులోని వినాయకుడి విగ్రహం వద్ద మంగళవారం హోమపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణాల్లో, వీధి కూడళ్లలో ఏర్పాటు చేసిన చవితి పందిళ్లలో యూత్, కమిటీ సభ్యులు భారీ గణపతి విగ్రహాలను పోటాపోటీగా నిలిపారు. ఆయా పందిళ్ల వద్ద రకరకాల పూలతో, రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.


నాదెండ్లలో...

నాదెండ్ల: వినాయక చవితి వేడుకలు మండలంలో వైభవంగా జరిగాయి. ఊరూ వాడా ప్రత్యేక చలువ పందిళ్లలో గణనాధుని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు జరిపారు. మంగళవారం రెండో రోజు వినాయకునికి పందిళ్ల వద్ద మహిళలు సామూహిక వ్రతాలు నిర్వహించారు. ప్రసాదాలు సమర్పించి పంపిణీ చేశారు. గణపవరంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో ఐదడుగుల మట్టి వినాయకుడికి పూజారి దర్శి ఉమామహేశ్వర్, అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

వినాయకునికి ఇష్టమైన లడ్డూ, ఉండ్రాళ్లు, గరిక గడ్డితో హారాన్ని తయారు చేసి సమర్పించారు. ఒక్క గణపవరం గ్రామంలోనే వివిధ పరిశ్రమలతో పాటూ ఆలయాల్లో, పుర వీధుల్లో సుమారు 80 వరకూ విగ్రహాలు ఏర్పాటయ్యాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో 150కు పైగా విగ్రహాలను ఏర్పాటు చేశారు. బుధవారం నుంచి నిమజ్జన కార్యక్రమాలు ప్రారంభమౌతాయని నిర్వాహకులు తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా నిమజ్జనాలు చేయాలని పోలీసులు నిర్వాహకులను ఆదేశించారు.

నందికుంటలో..

నాదెండ్ల: గణపవరం–నాదెండ్ల డొంక రోడ్డులో కొలువైయున్న చారిత్రాత్మక శ్రీ నందికుంట విఘ్నేశ్వర స్వామి ఆలయంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం రైతులు, వాహన యజమానులు తమ వాహనాలు, యడ్ల బండ్లతో ఆలయానికి వెళ్ళి ప్రదక్షిణలు చేసి పూజలు నిర్వహించారు. పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. ఉండ్రాళ్లు, వడపప్పు ప్రసాదంగా పంపిణీ చేశారు.




నరసరావుపేట హెల్పింగ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో వెంగపండ్లతో..



బొల్లాపల్లి మేళ్ళవాగులో పూజలు అందుకున్న గణనాథుడు



లింగారావుపాలెంలో వెలిసిన లంబోదరుడు



చిలకలూరిపేట చలివేంద్ర బజారులో నెమలి వాహనంపై..



నరసరావుపేటఎన్జీవో కాలనీలో గణపయ్య



రొంపిచరలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన లంబోదరుడు



చిలకలూరిపేట షరాఫ్ బజారులో అమెరికన్ డైమండ్లతో వినాయకుడు



యడ్లపాడు వడ్డెర వీధిలో కొలువైన బొజ్జ గణపయ్య



నరసరావుపేట శ్రీరాంపురంలో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...



శావల్యాపురంలో వినాయక చవితి వేడుకల్లో పాల్గొన్న భక్తులు



ఈపూరు వనికుంటలో ఏర్పాటు చేసిన భారీ వినాయకుడు

ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

వలంటీర్లు, వైద్య సిబ్బంది ఇళ్లకు వెళ్లి పరీక్షల నిర్వహణ

యడ్లపాడు: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం' నియోజకవర్గంలో ప్రారంభమైంది. ఈనెల 15వ తేదీ నుంచి వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటిని సందర్శించి ఆయా కుటుంబ సభ్యుల్లో అనారోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా అంటూ ఆరాతీస్తున్నారు. షుగర్, బీపీ, రక్తశాతం తదితర పరీక్షలను నిర్వహించి ఈనెల 30 తేదీ నుంచి ప్రారంభించే మెగా హెల్త్ క్యాంపులకు సంబంధించిన టోకెన్లను పంపిణీ చేస్తున్నారు. పరీక్షల నుంచి చికిత్స, మందులు వంటి అన్నీ ఉచితమే కావడంతో ప్రజలు కూడా సంతోషంగా ముందుకు వచ్చి ఆయా పరీక్షలను చేయించుకుని వైద్యశిబిరాల కోసం ఎదురుచూస్తున్నారు. సంక్షేమ పథకాలతో పాటు ప్రజాఆరోగ్య సంక్షేమాన్ని కాంక్షిస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని, ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పారదర్శకంగా చేపట్టి అమలు చేస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి విడదల రజినిని ప్రశంసిస్తున్నారు.

పారదర్శకంగా...

శావల్యాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమం పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్ తెలిపారు. మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి మాట్లాడుతూ మండలంలోని కనమర్లపూడి గ్రామ సచివాలయం పరిధిలో ఈనెల 30న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. ఇందులో భాగంగా గ్రామసచివాలయ పరిధిలో 12 మంది వలంటీర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో ఇంటింటి సర్వే చేసి ఏడు రకాల వైద్య సేవలతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగుల సమగ్ర వివరాలన్నీ ఆన్‌లైన్ నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ఈసర్వే ప్రక్రియలో ఆరోగ్య కార్యకర్త దాసరి రాజ్యలక్ష్మి, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు సంయుక్తంగా చేస్తున్నట్లు చెప్పారు.



షుగర్, బీపీ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని వివాహిత హత్య



మృతురాలు షేక్ ఆరీఫా

చిలకలూరిపేట టౌన్: మద్యానికి డబ్బులు ఇవ్వలేదని వివాహితను గొంతు నులిమి హత్య చేసిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని సుభానినగర్‌కు చెందిన షేక్ ఆరీఫా (31)కు 16 సంవత్సరాల కిందట గుంటూరుకు సంగడిగుంటకు చెందిన షేక్ రబ్బానితో వివాహమైంది. నాలుగేళ్ల నుంచి భార్యకు వివాహేతర సంబంధం ఉందన్న కారణంగా రబ్బాని ఆమెను విడిచి వేరుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన షేక్ నశీర్, ఆరీఫాతో వివాహేతర సంబంధం పెట్టుకొని చిలకలూరిపేట పట్టణంలో సహజీవనం చేస్తున్నాడు. మంగళవారం మద్యానికి డబ్బులు ఇవ్వలేదని దూషిస్తూ గొంతు నులిమి చంపేశాడు. మృతురాలికి ఇరువురు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి తల్లి షేక్ పర్వీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖాళీ స్థలాల్లో అద్దె వేలంపాట

బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరుగ్రామంలో వేంచేసియున్న వేణుగోపాల స్వామి దేవస్థానానికి సంబంధించి ఖాళీస్థలాలు అద్దె వేలంపాట నేడు(బుధవారం) నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ అధికారి బండి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ, ధర్మాదాయ చట్టం ప్రకారం ఈ వేలంపాటలు నిర్వహిస్తామని, ఉదయం 10 నుంచి స్థానిక ఆలయంలో వేలంపాట ఉంటుందన్నారు. అద్దె కాల పరిమితి 3 ఏళ్ళపాటు ఉంటుందని, 2023, నవంబర్ 11 నుంచి 2026 నవంబర్ 10 వరకు ఉంటుందన్నారు. వేలంపాటలో పాల్గొనదలచిన వారు ఒక్కొక్క ప్లాటుకు రూ.5వేలు చొప్పున ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. దేవదాయశాఖ నిబంధనలకు లోబడి ఈ వేలంపాటలు నిర్వహిస్తామని ఇఓ తెలిపారు.

అప్రమత్తతోనే అగ్ని ప్రమాదాల నివారణ

సత్తెనపల్లి: అప్రమత్తతోనే అగ్ని ప్రమాదాల నివారణ సాధ్యమని సత్తెనపల్లి అగ్నిమాపక అధికారి ఎంవీ సుబ్బారావు అన్నారు. జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపక అధికారి ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర బాల కుటీర్ పాఠశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై మంగళవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్నిమాపక అధికారి సుబ్బారావు మాట్లాడుతూ అనుకోకుండా అగ్నిప్రమాదం సంభవించినప్పుడు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించాలన్నారు. ప్రమాదం జరిగినప్పుడు భయపడకుండా దాన్ని ఎలా ఎదుర్కోవాలో వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.